క్లుప్తంగా

అన్న క్యాంటిన్ పునరుద్ధరణకు చర్యలు



సత్తెనపల్లి: పట్టణంలోని తాలుకా సెంటర్‌లో అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు అధికారులు ముమ్మర కసరత్తు చేపట్టారు. దీనిలో భాగంగా మున్సిపల్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం అన్న క్యాంటీన్‌ను సందర్శించి దానిని వాడుకలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ బి.మధుసూదనరావు, ఏఈ ఎం.సాగర్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, శానిటేషన్ సెక్రటరీ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ ప్రజలకు సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు

క్రోసూరు: వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రాల్లో, అన్ని హెల్త్ వెల్‌సెస్ కేంద్రాల్లో సోమవారం నుంచి ఆయా ప్రాంత ఎస్టీలకు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాలఅంకమ్మబాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ 05 నుంచి 40 సంవత్సాలున్న ప్రతి ఒక్కరికీ ఈ రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వారిలో రక్త కణాలు కొడవలి ఆకారంలో గుర్తిస్తే వారికి తగువిధంగా వైద్య చికిత్సలు అందించటం జరుగుతుందన్నారు. గుండ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లని చెప్పారు. రక్త పరీక్షల ద్వారా మాత్రమే రక్తహీనత గుణాలు గుర్తించటం జరుగుతుందన్నారు. సికిల్ సెల్ అనీమియా ఉన్నవారికి ఆక్సిజన్ రక్తనాళాలకు సక్రమంగా సరఫరా జరగదని తెలిపారు. మండలంలో లక్ష్యాలు పూర్తి చేసే వరకు ప్రతి రోజు రక్త పరీక్షలు నిర్వహించడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సిరిచందన, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

62 ఏళ్ల వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

నకరికల్లు: మైనర్ బాలికలు ఇద్దరిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివారు గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలికలు గ్రామంలోని చిల్లర కొట్టు దగ్గరకు కొనుక్కునేందుకు వెళ్లేవారు. ఈ క్రమంలో దుకాణదారుడైన 62 ఏళ్ల వ్యక్తి మైనర్ బాలికలు ఇద్దరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.నాగేందర్‌రావు తెలిపారు.

వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రత్నకుమారి తెలిపారు. ఈ వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్ కోర్సులు చదివే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులను చేరవచ్చని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాలకు 9299458262, 8639189463 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీ కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు కలశస్నపన, భక్తులచే అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారి ఊరేగింపు, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు నారాయణం శశాంక్, జయచంద్, మోహనకృష్ణ, ఆలయ ఈవో కొల్లి హనుమంతరావు, శివలింగ ప్రసాద్, చైర్మన్ కొల్లిపర సుబ్రహ్మణ్యం, బి.రవికుమార్, నాగపవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రమౌళీశ్వర ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీసమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే భక్తులకు ప్రసాదాల పంపిణీతో పాటు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్లబాటి రాము పాల్గొని పూజలు చేశారు.

దివ్య త్యాగాలకు ప్రతీక బక్రీద్

- మసీద్, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు
- సామూహిక నమాజ్‌లకు పోటెత్తిన ముస్లిం సోదరులు



సత్తెనపల్లిలోని ఈద్గాలో సామూహిక నమాజ్‌లో ముస్లింలు



సత్తెనపల్లిలోని పెద్ద మసీదులో నమాజ్‌లో ముస్లింలు

సత్తెనపల్లి: దివ్య త్యాగాలకు ప్రతీకయిన బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇస్లాం మత గ్రంథం ఖురాన్–ఎ–షరీఫ్‌లో 'ఇమాన్, ఇహన్, ఇబాదత్ అనే మూడు మూల సిద్ధాంతాలు ఉన్నాయని, భగ వంతుడు ఒక్కడే అనేది ఇమాన్, వ్యక్తిగతంగా సాంఘికంగా మానవుడు పాటించాల్సిన నైతిక విలువలు ఇహన్‌కు సంబంధించినవని, చివరిదైన ఇబాదత్‌లో ప్రతి మహ్మదీయుడు తప్పకుండా ఆచరించాల్సిన ఐదు నియమాలు ఉన్నాయని మత పెద్దలు అన్నారు. వాటిలో మొదటిది అల్లా(దేవుడు)ను విశ్వసించడం, రోజుకు ఐదు పర్యాయాలు నమాజు చేయడం, జీవితంలో ఒక్కసారైనా మక్కాను సందర్శించడం, వీటిలో చివరి నియమాన్ని పాటించే నేపథ్యంలో జరుపుకునే పండగే బక్రీద్ అన్నారు. పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజులు నిర్వహించారు. పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల ఈద్గాలో నిర్వహించిన సామూహిక నమాజ్‌లకు ముస్లిం సోదరులు పోటెత్తారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే ముస్లిం సోదరులు తమ శక్తికి తగ్గ స్థాయిలో దానధర్మాలు చేపట్టారు.

అచ్చంపేటలో ఘనంగా బక్రీద్

అచ్చంపేట: పవిత్ర బక్రీద్ పురస్కరించుకుని ముస్లిం సోదరులు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముస్లిం మత పెద్దలు ఖురాన్ పఠన చేసి ప్రార్థనలు చేశారు. అల్లా మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ప్రబోధించారు. ఎదుటివారిని గౌరవించడం, కష్టాలలో నున్న వారికి చేయూతనివ్వడం మానవత్వం అనిపించుకుంటుందని సూచించారు. మాదిపాడు, అచ్చంపేట, కస్తల, కొత్తపల్లి, వేల్పూరు గ్రామాలలో ముస్లింలు పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమరావతిలో...

అమరావతి: ముస్లింలకు పర్వదినమైన బక్రీద్ వేడుకలను సోమవారం మండల కేంద్రమైన అమరావతిలో ముస్లిం సోదరులు ఘనంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలుత ముస్లిం సోదరులందరూ ఈద్గా వద్ద మత గురువు మౌలానా వలిఉల్లా ఆధ్వర్యంలో బక్రీద్ పర్వదిన ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు చోట్ల ముస్లిం సోదరులు దానధర్మాలు నిర్వహించి శక్తి కొలది విందులతో బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండల వ్యాప్తంగా సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పెదకూరపాడులోని ముస్లింలు భారీ ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని, దానధర్మాలు చేయాలని మత పెద్దలు వివరించారు. పెదకూరపాడు, నగరపాడు, పాటిబండ్ల, తమ్మావరం, పొడపాడు, లింగంగుంట్ల గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: ముస్లింల అత్యంత ముఖ్యమైన పండుగైన బక్రీద్‌ను మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రోసూరు, అనంతవరం, దొడ్లేరు, హసనాబాద్, నాగవరం, 88 త్యాళ్లూరు, ఆవులవారిపాలెం, పీసపాడు, బయ్యవరం, ఊటుకూరు గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఈద్గా మైదానాలకు చేరుకుని ఇమామ్‌ను అనుసరించి ప్రత్యేక నమాజులు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. క్రోసూరులోని షాదీఖనాలో గల ఈద్గా మైదానానికి ముస్లింలందరూ చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

త్యాగనిరతిని తెలియజెప్పేదే బక్రీద్..

బక్రీద్ పండుగ అంటే ప్రజల పట్ల త్యాగనిరతి, సేవాభావం కలిగి ఉండాలని తెలియచెబుతుందని ఇమామ్ తెలియజేశారు. తన ఏకైన సంతానాన్ని దేవుడి ఆదేశాల మేరకు బలిదానం ఇచ్చేందుకు సిద్ధపడ్డ భక్తుడి భక్తికి మెచ్చుకుని అల్లా బలిదానంగా మేకపిల్లను ఇవ్వమని ఆదేశించాడని చెప్పారు. నిజానికి అల్లా వద్దకు బలిదానం భౌతికంగా చేరదని, అలాంటి త్యాగం వలన ఎంతమందికి మేలు జరుగుతుందో ఇస్లాం ప్రపంచానికి తెలియజెప్పిందని ఇమామ్ అన్నారు. ముస్లింలు ఇమామ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింల పెద్ద పండుగలలో బక్రీద్ ఒకటి. రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్షకు ఎలా ప్రాముఖ్యత ఉంటుందో బక్రీద్ పండుగకు ఖుర్బానీ అంతే ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ఆర్థిక స్థోమతను బట్టి ముస్లిం సోదరులు ఖుర్బానీ నిర్వహించారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువుల మాంసాన్ని మూడు సమ భాగాలుగా చేసుకుని పేదలకు పంచి పెట్టారు. ముందుగా ఉత్సాహంగా ఈద్ నమాజ్‌కు తరలివెళ్లారు. మండలంలో రెడ్డిగూడెం, గణపవరం, మొక్కపాడు, అనుపాలెం, ఇనిమెట్ల తదితర గ్రామాలలోని మసీదులు ముస్లిం సోదరులతో కిక్కిరిసిపోయాయి. ప్రతి గ్రామంలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ పరమత సహనం పాటించాలని, ఇస్లాం మతం శాంతిని బోధిస్తుందని తెలిపారు. అనంతరం ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చనిపోయిన వారి పేరుతో కుటుంబసభ్యులు కుర్బానీ అందించారు. పండుగ వేడుకల్లో భాగంగా ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

నకరికల్లులో బక్రీద్ వేడుకలు

నకరికల్లు: బక్రీద్ పర్వదిన వేడుకలను మండలంలోని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు జరుపుకునే పెద్ద పండుగల్లో బక్రీద్ ఒకటి. ఈదుల్ జుహాగా జరుపుకునే బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లోని కొండపై గల ఈద్గాల వద్ద గుండ్లపల్లి, చాగల్లు, కుంకలగుంట, చేజర్ల, చాగల్లు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన ముస్లిం సోదరులను ఉద్దేశించి మత పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం శాంతిని బోధిస్తుందన్నారు. ఇబ్రహీం ప్రవక్త అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటామన్నారు. బక్రీద్ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఖుర్బానీని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు ఆప్యాయంగా బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



పెదకూరపాడులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



క్రోసూరు ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజులు చేస్తున్న ముస్లింలు



రెడ్డిగూడెంలోని ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

సాందీపని ఆశ్రమంలో గాయత్రీ మహాయజ్ఞం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమంలో గాయత్రీమాత జయంతి సందర్భంగా 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం సోమవారం నిర్వహించారు. విశ్వశాంతి లోకకల్యాణార్థం సాందీపని ఆశ్రమ గాయత్రీ శక్తి పీఠ ప్రాంగణంలో పండిత శ్రీరామ శర్మ ఆచార్య మాతా భగవతీ దేవి శర్మ, రామకృష్ణ గురుదేవుల సూక్ష్మ సంరక్షణలో మహాయజ్ఞం నిర్వహించారు. గాయత్రీ పరివార్ సభ్యులు, భక్తులు మహాయజ్ఞంలో పాల్గొన్నారు. ఆశ్రమంలోని సరస్వతి మాత ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గాయత్రీమాత జయంతి

పెదకూరపాడు: మండల పరిధిలోని75 త్యాళ్లూరు గ్రామంలోని గీతా మందిరంలో సోమవారం గాయత్రీమాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఉపాసకులు ఆధ్యాత్మిక గురువులు అంకారావు మాస్టారు పాల్గొని గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాయత్రి హోమం నిర్వహించి గాయత్రి మాత విశిష్టత సత్సంగం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, గురువుని గౌరవించాలని సేవాభావం కలిగి ఉండాలని, గురువు ఆజ్ఞతో సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు కాశిపాడు, జలాలపురం, తాళ్లూరు అబ్బరాజుపాలెం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 10వ వార్షికోత్సవ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణం, గ్రామ శ్రేయస్సు కాంక్షిస్తూ స్వామి వార్ల వార్షికోత్సవ మహోత్సవం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు ఆరాధన, పుణ్యాహవాచనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్టాపన, వేంకటేశ్వర మూలమంత్ర హోమం, నారాయణ అష్టాక్షరీ మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వార్షికోత్సవం సందర్భంగా హోమాలు చేస్తున్న దృశ్యం

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చు

వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి



రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనం వేసుకునేముందు విత్తన శుద్ధి చేయడం వలన ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఒక కేజీ వరి విత్తనాలను లీటరు నీటిలో 3 గ్రాముల కార్బనిజంతో కలిపి 20 గంటలు నానబెట్టిన అనంతరం నారుమడులలో చల్లుకోవాలని సూచించారు. అలాగే కేజీ మిర్చి విత్తనాన్ని 3 గ్రాముల కాప్టేన్ లేదా కార్బనిజంతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. పత్తిలో ఎండు తెగులు రాకుండా ఉండడానికి ఒక కిలో విత్తనానికి 8 గ్రాముల టేకో డెర్మావిరిడితో విత్తన శుద్ధి చేయడం మంచిదన్నారు. విత్తన శుద్ధి చేసి సాగు చేస్తున్న పంటలను చీడ, పీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పత్తి చుట్టూ 4 సాళ్లకు ఒక సాలు కంది, మినప, పెసర పంటలను అంతర పంటగా సాగు చేసుకోవచ్చునన్నారు. మాగాణి చుట్టూ గట్టుపై కంది పంటను రైతులు అంతర పంటగా సాగు చేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ కూడా అంతర పంటలను సాగుచేసే రైతులను ప్రోత్సహిస్తుందన్నారు.

బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేర్పించే బాధ్యతను ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు కోరారు. సోమవారం ఎంఈవో మాట్లాడుతూ 1 నుంచి 10 తరగతి విద్యార్థులకు అందాల్సిన స్టూడెంట్ కిట్లు యూనిఫాంమినహా అన్నీ వచ్చినట్లు చెప్పారు. నేను బడికి పోతా అనే కార్యక్రమం ద్వారా అన్నీ గ్రామాల్లో పరిధిలో ప్రజల్లో చైతన్యం పెంపొందించాలన్నా రు. గత ఏడాదిలో 2913 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారన్నారు. బడికిపోతా కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకే నేరుగా వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరు తదితర వాటిని ఉపాధ్యాయులు వివరించాలన్నారు. బ్యాగ్స్–2398, బెల్టులు–1684, నోట్ పుస్తకాలు–13694, షూస్–2414, పాఠ్యపుస్తకాలు–24823, తదితర వన్నీ నూరుశాతం అన్ని పాఠశాలలకు మంజూరైనట్లు చెప్పారు.

అంగన్‌వాడీలకు అండగా నిలుస్తా

- ప్రతీ సమస్య పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: సమాజానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చేసే సేవ అనిర్వచనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తన కుమార్తె డాక్టర్ అమూల్యతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కోరిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామన్నారు. వేతనాల పెంపు సహా అన్ని డిమాండ్లను పరిష్కరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పిస్తామన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఆర్థికంగా దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నామన్నారు. విద్యా, వైద్య రంగాలను సమూలంగా ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రజల కోసం నిత్యం పనిచేసే అంగన్‌వాడీలను ఆదుకునే బాధ్యత తానే తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు డి.శివకుమారి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వర స్వామి వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో 7వ వార్షికోత్సవాలు సోమవారం ముగిశా యి. ఈ సందర్భంగా ఆలయ పూజారి సౌభాగ్య శర్మ మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి గ్రామస్తులు ఆలయ ధర్మకర్త కొసన రామకోటేశ్వరరావు దంపతుల సారథ్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. చివరిరోజు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాలు మేళ తాళాలు నడుమ దంపతులచే స్వామి వారికి కల్యాణ వేడుకలతో పాటు మహాపూర్ణాహుతి, విశేష పూజలు నిర్వహించారు.



ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను పూలమాలలు నూతన పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భారీ అన్నదాన సంతర్పణ కార్యక్రమాలతో ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయటంతో పాటు ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు.

శ్రేష్ట ఆస్పత్రిలో గుండెజబ్బులకు ఆధునిక చికిత్స

గుంటూరు మెడికల్: నగరంలోని గుజ్జనగుండ్లలో ఉన్న శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక పద్ధతిలో ఐవీయూఎస్ విధానం ద్వారా గుండె చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున తెలిపారు. ఇటీవల కాలంలో యువకులు ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఎక్కువ మంది గుండె రక్త నాళాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని తొలగించడానికి యాంజియోగ్రామ్ ద్వారా స్టంట్లు అమర్చి అడ్డంకులు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఇంట్రా వర్క్యూలర్ ఆల్ట్రా సౌండ్ (ఐవీయూఎస్) ద్వారా స్టంట్లు అమర్చడం వలన రోగులకు దీర్ఘకాలంలో మళ్లీ రక్త నాళాల్లో పూడిక ఏర్పడడానికి అవకాశాలు తక్కువ అన్నారు. స్టంట్ కూడా సరైన పరిణామంలో తగిన విధంగా కచ్చితంగా అమర్చడం జరుగుతోందని వివరించారు. దీని వలన మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చికిత్స తమ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు నాగార్జున వివరించారు.

సరస్వతి శిశు మందిర్‌లో సరస్వతి హోమం



అమరావతి: స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా సోమవారం వేద పండితులచే సరస్వతి హోమం నిర్వహించారు. తొలుత సరస్వతి పూజ, హోమం నిర్వహించి, విద్యార్థులచే సరస్వతి అష్టోత్తర పూజ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న గురువులు, పెద్దలు విద్యార్థులకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జై నాబ్ జాహ, సాహిత్య పరిశోధకులు డాక్టర్ వావిలాల సుబ్బారావు, పాఠశాల నిర్వాహకులు పులిపాటి వెంకట పవన్ కుమార్, శనగవరపు రామ్మోహన్ శర్మ, శివ పార్వతి, ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావులతో పాటు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శంభులింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో శంభులింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి శాంతి కల్యాణం, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



మాచర్ల: పట్టణంలోని పాతమాచర్ల, వడ్డెరపాలెం ప్రాంతంలో గల శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవార్ల ఆలయ తృతీయ వార్షికోత్సవం పురస్కరించుకొని స్వామి వారికి ఉదయం నుంచి పూజలు, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఆలయానికి తరలివచ్చారు. అర్చకుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దేవాలయంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అనేకమంది తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే యరపతినేనికి ఘన స్వాగతం



పిడుగురాళ్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావు గెలుపొందిన తర్వాత మొదటి సారిగా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల పట్టణానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు జంగా కృష్ణమూర్తిలకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కొండమోడు నుంచి పట్టణంలోని టీడీపీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని గంగమ్మగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో, అలాగే పట్టణంలోని చర్చిలు, మసీదులలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు.